క్లుప్తంగా

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు


డీఎస్ నాగేశ్వరరావు

ఏన్కూరు: యూటీఎఫ్ జిల్లాకార్యదర్శిగా డీఎస్ నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. సత్తుపల్లి డివిజన్ కేంద్రంలో ఈ నెల 14,15వ తేదీల్లో జరిగిన జిల్లా మహాసభలో నాలుగోసారి జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావును ఎంపిక చేశారు. ఏన్కూరు మండలం మూలపోచారం ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై పోరాటాలు చేస్తామన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడిగా చలసాని


సాంబశివరావు

సత్తుపల్లి: సత్తుపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడిగా చలసాని సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా కొత్తూరు ప్రభాకర్‌రావు, అధ్యక్షుడిగా గుడిమెట్ల గాంధీ, ఉపాధ్యక్షులుగా దారా కృష్ణారావు, నడిపల్లి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నడిపల్లి అర్జున్‌రావు, సహాయ కార్యదర్శులు అడపా సాయి, కృష్ణప్రసాద్, కోశాధికారిగా బోనగిరి చెన్నారావు, సహాయ కోశాధికారిగా రతికంటి సత్తిబాబు, కార్యవర్గ సభ్యులుగా ఎంఏ పరమేజ్, గుడిపూడి గాంధీ, గుమెట్ల కిషోర్, మల్లూరు అంకమరాజు ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

బోనకల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం నిర్వహిస్తామని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలను విడుదల చేయాలన్నారు. గురుకులాల టైంటేబుల్ మార్చాలని పెండింగ్ బిల్లులన్నింటిని వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా మహాసభలకు బోనకల్ మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరౌతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు సద్దాబాబు, లక్ష్మణ్‌రావు, గంగారావు, గుగులోత్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీలోని రాజీవ్ నగర్ ఏర్పడి 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా మహాసభల విజయవంతం కోరుతూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, విశ్వనాథం, వెంకటేశ్వరరావు, పోచయ్య, వెంకమ్మ, వేణు, లక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నూతన సంఘం ఎన్నిక

వైరారూరల్: వైరా మండల పంచాయతీ కార్మికుల నూతన సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గొల్లపూడిలో నిర్వహించిన సంఘం ఆత్మీయ సమావేశంలో సంఘం నూతన అధ్యక్షుడిగా ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా తేళ్లూరి రాజేందర్, కార్యదర్శిగా కొరివి శ్రీను, కోశాధికారిగా గొర్రెముచ్చు రాకేష్, సలహాదారులుగా మహేష్, వెంకటనారాయణరెడ్డి, లక్ష్మాచారి, కొండలులను ఎన్నుకున్నారు.

దత్తాత్రేయ జయంతి వేడుకలు

కల్లూరు: కల్లూరులోని శ్రీ సాయిరామ ధ్యాన మందిరంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదనశర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలు, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాల వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొప్పురావూరి బలరామ్, బొగ్గవరపు మొరళీకృష్ణ, గుగులోత్ బావాజి, గార్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాలల 'సింహగర్జన'కు తరలిన నాయకులు

ముదిగొండ: గుంటూరులో జరిగే మాలల సింహగర్జన సభకు జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఉండేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముదిగొండ మండలం నుంచి ఆదివారం సంఘం నాయకులు భారీగా బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వీరబాబు, గణపతిరావు, ఉద్యోస్తుల సంఘం నాయకులు తదితరులు తరలివెళ్లారు.

భారంగా పశుపోషణ

- తీవ్రంగా గడ్డి కొరత
- ఏటేటా తగ్గుతున్న పశుసంపద
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఆందోళనలో పాడి రైతులు



చింతకాని: దేశానికి వెన్నుముక రైతు.. రైతుకు వెన్నుముక పశుసంపద. అలాంటి పాడి పశుసంపద ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. పశుపోషణ నేడు భారంగా మారటంతో ప్రస్తుతం రైతులు పశుపోషణపై అంతగా ఆసక్తి చూపటం లేదు. దీనితో పశువుల సంఖ్య ప్రతి ఏడాది గణనీయంగా తగ్గుతూ.. చివరకు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్యాకెట్ పాలపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురిస్తుంది. మండలంలో గతంలో 40 వేలకు పైగా పశువులు ఉండగా ప్రస్తుతం ఆవులు 3,244, గేదెలు 22,211 ఉన్నాయి. పశుగ్రాసం కొరత, పెరుగుతున్న దాణా ధరలతో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. రేయింబవళ్లు కష్టపడి పశువులను, గేదెలను పోషిస్తే రోజు కూలీ కూడా రాని దయనీయ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడిపరిశ్రమతో సన్న, చిన్నకారు రైతుల కుటుంబాలు గతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగిపోతుండేవి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో లీటరుకు రూ.60 చెల్లించినా నాణ్యమైన పాలు దొరకటం లేదు. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో లీటరు పాలు వంద రూపాయలు అయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాడు పాలకేంద్రాలకు పాలు పోసిన రైతులే నేడు పాలను కొనుగోలు చేసుకుంటున్న దుస్థితి ఏర్పడింది.

పెరిగిన ఖర్చులు..

పాడి గేదలకు అందించే గడ్డితో పాటు మిక్చర్, దాణా, కొబ్బరిపొడి, ఉలవపొట్టు ధరలు విపరీతంగా పెరిగిపోవటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. వరి పంటను యంత్రాల సాయంతో కోత కోయిస్తున్నందున ఎండు గడ్డికి తీవ్రంగా కొరత ఏర్పడుతుంది. గతంలో రూ.60 ఉన్న ఎండుగడ్డి కట్ట ప్రస్తుతం రూ.100 నుంచి రూ.130 వరకు ఉంటుందని, అధిక ధరను వెచ్చించినప్పటికీ ప్రస్తుతం ఎండుగడ్డి దొరికే పరిస్థితి లేదు. ఇదిలాఉండగా పాలకు గిట్టుబాటు ధర కూడా లేకపోవటంతో గేదెలను మేపటం సాధ్యపడక విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక గేదె పోషణకు వచ్చే పాలు కంటే ఖర్చు అధికమై గిట్టుబాటు కాకపోవటంతో పశువుల పోషణ మరింత భారంగా మారిందని రైతులు వాపోతున్నారు.

ప్రోత్సాహం కరువు..

పాడి రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం పూర్తిగా కరువైంది. ధరలు పెరిగి సంక్షోభంలో ఉన్నటువంటి పాడి పరిశ్రమకు ప్రభుత్వం తగిన సహకారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పశుపోషణకు, పాల ఉత్పత్తిదారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తామంటూ చెబుతున్న ప్రభుత్వాలు ఆచరణలో అమలు చేయటం లేదని వాపోయారు. పశువుల పోషణకు అవసరమైన పశుగ్రాస విత్తనాలను ఉచితంగా అందజేసి తగిన సహకారాన్ని అందించి అన్ని విధాలుగా ఆదుకొని పాడిపరిశ్రమను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం సహకరించాలి..



పాల ఉత్పత్తులపై ఆధారపడే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించాలి. దాణా ఖర్చులు పెరగటంతో పాటుగా ఎండు గడ్డి కూడా దొరికే పరిస్థితి లేదు. పాల కేంద్రాల్లో కూడా పాలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించి పాడి రైతుల్ని ఆదుకోవాలి.

– పగడాల పుల్లయ్య, పాడిరైతు, మత్కేపల్లి

విత్తనాలను వినియోగించుకోవాలి..



పాడి రైతులకు ప్రభుత్వం అందజేసే పశుగ్రాస విత్తనాలను వినియోగించుకోవాలి. పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పశుగ్రాస విత్తనాలను అందజేస్తుంది. ప్రభుత్వం అందజేసే మేలురకం పశుగ్రాస విత్తనాలతో పాటు ఎండు గడ్డిని కూడా కొంతమేరకు వినియోగిస్తే పాల దిగుబడి పెరిగి ఆదాయాన్ని పొందవచ్చు.

– డాక్టర్ రామ్‌జీ, మండల పశువైద్యాధికారి, చింతకాని

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి


మాట్లాడుతున్న రవి

సత్తుపల్లిటౌన్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. సత్తుపల్లిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం రెండో రోజు టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మంజిల్లా 6వ మహాసభలు నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటించిన విధంగా హామీలను నెరవేర్చి న్యాయం చేయాలని.. ఇప్పటికే గత ప్రభుత్వం సృష్టించిన అగాదాలను పూడ్చే ప్రయత్నాలు చేయాలని కోరారు. ఎన్‌ఈపీ నూతన జాతీయ విద్యావిధానం 2020ను రద్దు చేసి రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాబోధనలో మతీకరణను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ సాధించుకున్న నాటి నుంచే కాక ముందు నుంచి కూడా అనేక సమస్యలు పెరిగాయని, దాని మూలంగా విద్యారంగంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆందోళన పెరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచుతున్నామని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేసి రెసిడెన్షియల్ పాఠశాలల్లో పని చేస్తున్న అందరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాభవాని, రాష్ట్ర ఎన్నికల అధికారి, కార్యదర్శి రాజు, సీనియర్ నాయకులు బండి నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు జి.రమేష్, వి.రామారావు, నిర్మలకుమారి, కోశాధికారి రాంబాబు, ఉపాధ్యక్షులు షమీ, రంజాన్, ఉద్దండు, వెంకన్న, సుధాకర్‌లతో పాటు చెరుకు శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి


కొదుమూరులో సభ్యత్వాలను అందజేస్తున్న గోవిందరావు

చింతకాని: రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం మండలంలోని కొదుమూరులో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతాంగ సమస్యలపై ఈనెల 16వ తేదీన తహసీల్ ఎదుట నిర్వహించే ధర్నాలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి, నాయకులు కృష్ణ, సుజాత, వెంకటేశ్వర్లు, సతీష్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, భాను, సాయి, వెంకన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్, ఫాదర్

వైరా: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు జీసస్ చెప్పిన పలుకులు ప్రేమ, శాంతి, సహనంతో తోటి వారికి సాయపడుతూ జీవనం గడపాలన్నారు. అనంతరం చర్చి ఫాదర్ మాదాసు రాజుతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తప్పెటరవి, జగదీష్, శ్రీకాంత్, జోజి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు

సత్తుపల్లిటౌన్: రామకృష్ణ - వివేకానంద బావ ప్రచార పరిషత్ 6వ భక్త సమ్మేళనం ఈ నెల 28, 29వ తేదీల్లో సత్తుపల్లిలో జరగనుంది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో వివేకానందుని జీవిత చరిత్రపై ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శ్రీరామకృష్ణ సేవా సమితి సత్తుపల్లి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, వేంసూరు మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విజేతలకు ఈనెల 28న స్థానిక మాధురి ఫంక్షన్‌హాల్‌లో జరగనున్న విద్యార్థి సమ్మేళనంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు గట్టే వాసు, జి.రామకృష్ణ, విద్యా సంస్థల నిర్వాహకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడికి అభినందన


వైరాలో కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు రవికుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా: కాంగ్రెస్ సేవాదళ్ వైరా మండల అధ్యక్షుడిగా నియమితుడైన గోండేలా రవికుమార్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అభినందించారు. సేవాదళ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రవికుమార్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రాష్ట్ర కార్యదర్శి దయాకర్, జిల్లాసేవాదళ్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే..

కారేపల్లి: కారేపల్లి శ్రీవెంకటసాయినగర్‌లోని రాము - శారద దంపతుల కుమార్తె సాయిఆరాధ్య చెవులు కుట్టువేడుకకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదివారం హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు టోనీవీరప్రతాప్, భీముడు, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు గురుబ్రహ్మ అవార్డు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనా విభాగం ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావుకు ఏపీ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ గురుబ్రహ్మ స్టేట్ అవార్డు–2024 ప్రకటించింది. ఈ మేరకు ప్రొఫెసర్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 16 ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వరిస్తూ మరోవైపు దివ్యాంగుల హక్కులు - సాధికారిత కోసం పోరాడుతున్నారు. శ్రీనివాసరావుకు పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ధనుర్మాస వ్రత దీక్షలు


రామకృష్ణమాచార్యస్వామి

సత్తుపల్లిరూరల్: గోదాదేవి శ్రీకృష్ణుడి ప్రార్థనలు చేస్తూ ఆయనను పతిగా పొందాలని ఆ గోదాదేవి చేసిన వ్రతమునకు ధనుర్మాస వ్రతమని పేరు వచ్చిందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీరామన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కలియుగంలో చక్కటి శ్రద్ధతో భగవంతుడిని ఏది కోరిన అందిస్తాడని తల్లి గోదాదేవి నిరూపించిందన్నారు. ధనుర్మాస వ్రతం యావత్ మానవాళికి ఆదర్శ ప్రాయని పేర్కొన్నారు. ఈ వ్రతాన్ని సత్తుపల్లి మండలంలోని రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 16నుంచి జనవరి 13 వరకు నిర్వహించబడుతుందని రామకృష్ణమాచార్య స్వామి తెలిపారు. నెల రోజుల పాటు చేపట్టే ఈ వ్రతంతో శ్రీకృష్ణ దీక్ష కూడా ఆలయంలో నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తలు ఒగ్గ పుల్లారెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, వసంతలక్ష్మి, గొర్ల చెన్నారెడ్డి తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మట్టా బాబురాంరెడ్డి కుమార్తె వివాహం ఆదివారం వనంవారి కిష్టాపురంలో జరిగింది. ఈ వివాహానికి తెలంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గిరికె ఉపేందర్‌రావు, నాయకుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో.. పూర్వ వీఆర్వోలను తెలంగాణాలోకి తీసుకురావాలని కోరుతూ భట్టికి వినతిపత్రం అందించగా ఆయన స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పాలేరు షుగర్స్ మాజీ చైర్మన్ నరసింగరావు, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, జిల్లా, మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, రమేష్‌బాబు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


వీయంబంజర్ సీఎస్ఐ చర్చికి నగదు అందిస్తున్న ధనలక్ష్మి కుటుంబ సభ్యులు

పెనుబల్లి: క్రిస్మస్ పండుగ సందర్భంగా అడుసుపల్లి ధనలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు వీయంబంజర్‌లోని చర్చీలకు ఆర్థిక సాయం అందించారు. అడుసుపల్లి ధనలక్ష్మి భర్త వెంకటేశ్వరరావు, కుమారులు అజయ్‌కుమార్, విజయ్‌కుమార్‌లు గ్రామంలోని సీఎస్ఐ చర్చికి, యెహోవా యీరే చర్చికి రూ.10 వేలు అందించారు. సీఎస్ఐ చర్చి సంఘ పెద్దలు కాంతయ్య, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు వితరణ


క్రీడాకారులతో పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 65 మంది క్రీడాకారులకు భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రూ.50వేల విలువ చేసే దుస్తులను వితరణ చేశారు. వీటిని ఆదివారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దాత యరమల పూర్ణచంద్రారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, కృష్ణారావు, ఇస్మాయిల్, వెంకటనర్సయ్య, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ముదిగొండ: ముదిగొండ మండలం బాణాపురంలో శనివారం నాగమల్లేశ్వరీ ఉరి వేసుకుని మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు మృతురాలి తల్లి అంజమ్మ.. కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారేపల్లి కస్తూర్బాను సందర్శించిన ఇన్‌చార్జ్ డీఈఓ


విద్యాలయాన్ని సందర్శిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ చావా శ్రీనివాసరావు

కారేపల్లి: కారేపల్లి కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఇన్‌చార్జ్ డీఈఓ చావా శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థినులతో మాట్లాడి.. పెంచిన మెనూ చార్జీల పట్ల విద్యార్థినుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకులంలో ఉన్న స్టోర్‌ను పరిశీలించారు. మెనూ సక్రమంగా పాటించకపోతే.. కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

సాధిక్ అలీకి ఘన నివాళులు

కల్లూరు: తోపుడుబండి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన సాధిక్ అలీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కల్లూరులోని తిరువూరు క్రాస్ రోడ్‌లోని కాళోజీనగర్‌లో ఆయన నివాసంలో సాధిక్ అలీ సంస్మరణ సభ నిర్వహించగా.. అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాధిక్ అలీ సతీమణి హైదరాబాద్ జేడీఏ ఉషా దయాల్, రాజమండ్రి డీఎంఅండ్‌హెచ్ఓ ఆశ దయాల్, కిషోర్ దత్, లక్కినేని రఘు, లక్కినేని కృష్ణ, పుల్లయ్య, రామారావు పాల్గొన్నారు.

నేడు రుద్రాభిషేకం

తల్లాడ: మార్గశిర మాసంలో సోమవారం నాడు ఆరుద్ర నక్షత్రం కావడంతో శివాలయంలో రుద్రాభిషేకం ఎంతో విశేష ఫలితాన్నిస్తుందని అర్చకులు కంచెల సతీష్ శర్మ తెలిపారు. మార్గశిర మాసంలో ఆర్ద్ర నక్షత్రం నాడు పార్వతి సమేతుడగు మూర్తిని, మరియు శివలింగమును దర్శించుట కుమార స్వామి కంటే అధిక ప్రీతి పాత్రుడగనని, ఆ శుభ దినమున దర్శనం మహా ఫలం పొంద వచ్చని పేర్కొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు

అమరజీవి, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యాన ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు త్యాగాలను గుర్తుచేసుకున్నారు.


వైరా: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు


కల్లూరులో..


మధిర: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా: వైరాలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యాన నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన ఆత్మత్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. దళిత ఉద్ధరణకు దళితుల దేవాలయ ప్రవేశం కోసం పోరాడిన మహనీయుడని, అతడిని కేవలం ఒక కులానికే పరిమితం చేసి చూడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దారా వెంకటకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి కొల్లా రాంబాబు, జిల్లా అవినాష్, చల్లా వెంకటరమణ, మహిళా అధ్యక్షురాలు బొగ్గవరపు సునీత, రాయల రోజా, మిట్టపల్లి పద్మజ, కుమారి, మంజుల, గీత, చక్రవర్తి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మధిర: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఇరుకుళ్ల లక్ష్మీనర్సింహారావు, కల్యాణ మండపం అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణతో పాటు పలువురు పొట్టి శ్రీరాముల విగ్రహానికి, చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని గాంధీసెంటర్‌లోగల పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య పేద మహిళ బాణాల కృష్ణకుమారికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దూపకుంట్ల వెంకటఅప్పారావు చేతుల మీదుగా కుట్టుమిషన్ అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొప్పు పరమేశ్వరరావు, దూపకుంట్ల పుల్లారావు, కొప్పు ప్రసాద్, నందనపాటి మురళి, కేతేపల్లి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మండల అధ్యక్షుడు అనుమోలు శ్రీనివాసరావు, కల్యాణ మండపం అధ్యక్షుడు సంకా రాంబాబు, పట్టణ అధ్యక్షుడు చలువాది నగేష్, చారుగుండ్ల అచ్యుత సీతారామారావు, నాగేశ్వరరావు, హనుమంతరావు, రామారావు, వీరభద్రం, మొరళి, సత్యనారాయణ, పుల్లారావు, మధు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642